# అతిథి

## డి.సి. ఫణి

రమణి అందంగా వుంటుంది. చాలా ఆకర్షణీయంగా అలంకరించుకొంటుంది. కుర్రాళ్ళు, యువకులు, మధ్యవయస్కులు, ముసలివాళ్ళు.. ప్రతి మగపురుగు రమణిని ఆశతో చూడాల్సిందే. లేకపోతే వాడసలు మగవాడే కాదు. ఇది రమణి ఫిలాసఫీ.

ఆమె ఒక్కచూపుతో ఎదుటివాడి గుండెల్లో గుబులు పుట్టాల్సిందే. ఆమె ఒక్క నవ్వుతో ఎవడయినాసరే తైతెక్కలాడాల్సిందే. ఇది కూడా ఆమె ఫిలాసఫీనే.

స్వంత ఊరు చిత్రదుర్గ. బాగా వున్న కుటుంబం. తండ్రిగారు పోయి చాలా ఏళ్ళయ్యాయి. ఐదారిళ్ళు బాడుగకిచ్చి, ఒక చిన్న ఇంట్లో వుంది అమ్మ. పొలాలు కౌలుకిచ్చారు. లైఫ్ 'ఎంజాయ్' చేయడం కోసం బెంగుళూర్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో వుద్యోగం చేస్తుంది రమణి.

అది బెంగుళూరు. మాగడి రోడ్డు, అయిదవ క్రాస్‌లో ఒక బస్ స్టాప్. సమయం ఉదయం పది గంటలు. సిటీ బస్సులన్నీ నగరవాసులతో నిండి చాలా భారంగా కదులుతున్నాయి. కాలు మోపడానికి కూడా చోటులేదు.

బస్ స్టాపులో నిల బడిన రమణి చూపు రోడ్డు మీదే వుంది. నిండు గర్భిణిగా వున్న సిటీ బస్సుల్లో సర్కస్ చేస్తూ, తన అందమైన 'బాడీ'ని ఉల్పాగాళ్ళందరూ తాకేలా.. ప్రయాణించే టైపు కాదు రమణి. ఒక్క చిన్న నవ్వు నవ్వి కార్లలోనే, బైకుల మీదో ప్రయాణించే టైపు. అలాంటి వాడికోసమే ఆమె పడిగాపు.

''మిస్'' అమాయకంగా పిలిచింది ఒక మగ కంఠం.

'వల విసరడానికి ముందుగానే పడ్డాడెవడో కాలుజారి' అనుకొంది రమణి.

''మీతో...'' జంకుతూ అన్నాడా ఆగంతకుడు.

''...కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి అంటారు. అంతేగా'' అంటూ కిలకిలా నవ్వింది ఆమె.

అవునన్నట్లుగా తల వూపాడా గొర్రె.

ఇద్దరూ కలిసి దగ్గరగా వున్న చిన్న హోటల్‌కెళ్ళారు కాఫీ తాగుతూ మాట్లాడుకోడానికి.

వచ్చినవాడి పేరు క్రిష్ణ. అమాయకుడు. ప్రస్తుతానికి జేబులో డబ్బున్నవాడు. రెండే క్షణాలలో పసిగట్టింది రమణి. మూడో క్షణంలో అతడికి చాలా దగ్గరయింది. అంతే.. టెలిఫోన్లోనే కంపెనీకి ఫోన్ చేసింది...ఈరోజు సెలవు కావాలని. ఆ కంపెనీ మేనేజర్‌కు తెలుసు-ఇలాంటి ఫోన్ కాల్ అసలు గుట్టు--ఆమె ఎవరికో 'కంపెనీ' ఇస్తూ వుంటుందని.

★★★

క్రిష్ణ, రమణి మార్నింగ్ షోకి పోయారు. మెజెస్టిక్‌లో మంచి హిందీ పిక్చర్, వెంకటేష్‌ది. ఆటోలో మీనవాన సర్కిల్ లోని సంధ్య రెస్టారెంట్‌లో మంచి ఆంధ్రాస్టైల్ భోజనం ముగించుకొని, చాలా దగ్గర్లోనే వున్న హోటల్ కామత్‌లో రూం తీసుకొన్నారు.


క్రిష్ణ చాలా ఆశ్చర్యంలో మునిగిపోయాడు. కలలో కూడా ఎరుగని స్వర్గమది. జీవితంలో మొదటిసారిగా, అందమైన రమణితో..కాదు, కామినితో ఇలాంటి మధురమైన క్షణాలను ఎందరనుభవించగలరు. ఖర్చు కొంచెం కాస్ట్లీనే. అయినా ఈ 'సుఖం' దగ్గర అది నిండు సున్న.

రమణి కూడా చాలా ఆశ్చర్యంగానే ఆలోచిస్తుంది. తాను ఎందరో మగాళ్ళను ఇప్పటికే చూసింది. కాని ఇలా, గొరైలా, చంటబ్బాయిలా వెంటబడ్డ క్రిష్ణలాంటివాడ్ని చూడ్డం ఆమెకిదే ప్రథమం. బట్టల మీద భాగోతానికే ఇప్పటికే రెండు మూడు వేలు ఖర్చయ్యాయి. ఇంక బట్టలు లేకుండా భాగోతం జరిగితే-దాని విలువ ఎన్ని వేలు? ఆలోచించింది రమణి.

''ఏమండీ'' రమణి కంఠం చాలా తియ్యగా వుంది.

''చెప్పండి'' అన్నాడు క్రిష్ణ మంత్రముగ్ధుడై...

''మీ గురించి, మీరిక్కడికొచ్చిన పని గురించి, చెప్పనే లేదు..'' యాంత్రికంగా అడిగింది.




''చెప్పాలని ప్రయత్నిస్తూనే వున్నాను...కానీ మీరే చెప్పనివ్వడం లేదు.''

వాడి గురించి, వాడి బోడి పని గురించి రమణికెందుకు? ఏదో చెప్పాలనుకొన్న క్రిష్ణ ప్రయత్నానికి 'ఫుల్‌స్టాప్' పెడుతూ ఆమె అతగాడిని షాపింగ్‌కు పిలుచుకు పోయింది. మరికొన్ని వేలు ఖర్చు పెట్టించడానికి!

షాపింగ్ తరువాత-భోజనం వగైరాలన్నీ ముగించుకొని హోటల్‌కి జేరుకోడానికి దాదాపుగా రాత్రి తొమ్మిది గంటలయ్యింది.

రమణికిదేం కొత్త కాకపోయినా వింతగా మాత్రం వుంది. క్రిష్ణకు స్వర్గమే భూమికి దిగినట్లుగా వుంది.

షాపింగ్ తరువాత రమణి ఆమె రూంకు పోతుందేమోనన్న దిగులుతో వున్న క్రిష్ణ-రమణి తనతోపాటు హోటల్‌కు రావడంతో తన శృంగార జీవితంలో మొదటిరాత్రి మొదలయింది.

ఆ రాత్రి రమణి పచ్చిగా రెచ్చిపోయింది. తనకు తెలిసిన సెక్స్ ఫీట్లన్నీ ప్రదర్శించింది. ఆడదంటే ఏమిటో మగాడికి తెలియజేసింది. క్రిష్ణ కూడా ఏం తక్కువ తిన్నాడా? పగలంతా ఎద్దులా మొద్దులా వున్న అతను ఆ రాత్రి చూపించాడు-తన లీల! మాటల్లో ఏమోకాని చేతల్లో మాత్రం చాలా చురుకయినవాడే. ఆట్లాడారు-పోట్లాడారు. చివరికి 'ఆ యుద్ధం' ముగించి ఇద్దరూ పూర్తిగా ఓడిపోయారు.

★★★

ఉదయం తొమ్మిది గంటలు. రమణి త్వరగా రెడీ అయింది డ్యూటీకి.

రాత్రి జరిగింది గుర్తుకు రాగానే కొంచం సిగ్గుపడ్డాడు క్రిష్ణ.

రూం బాయ్ తెచ్చిన టిఫిన్ తిన్నారిద్దరూ.

''రాత్రి మరలా రావాలా?'' అడిగింది రమణి కొంటెగా.

''నాకా అదృష్టం లేదు. ఈరోజే ఊరికి పోతున్నాను'' కొంచెం బాధగా అన్నాడు క్రిష్ణ. మాట్లాడుతూనే ఆరువేల రూపాయిలు ఆమె చేతికిచ్చాడు. ఆశ్చర్యపోయింది. తాను చాలా తెలివిగా తన అందాన్ని తన యౌవనాన్ని 'క్యాష్' చేసుకొంటూంది. జీవితాన్ని చాలా ఆనందంగా ఎంజాయ్ చేస్తూంది. ఈ మగవాళ్ళెంత మూర్ఖులు?

''రమణి..క్యాష్ ఆరువేలుంది కదూ? నిన్నటి నుంచి దాదాపుగా నాలుగువేలు ఖర్చయింది. మొత్తం పది వేలయింది కదూ..'' అంటూ ఇంకా ఏమో చెప్పబోతున్న క్రిష్ణ మాటల్ని మధ్యలోనే కట్ చేస్తూ అడిగింది ఆమె.

''ఏమండీ'' రమణి కంఠం చాలా తియ్యగా వుంది.

''చెప్పండి'' అన్నాడు క్రిష్ణ..మంత్రముగ్ధుడై.

''మీ గురించి, మీరిక్కడికొచ్చిన పని గురించి, చెప్పనే లేదు?'' యాంత్రికంగా అడిగింది.

''చెప్పాలనే ప్రయత్నిస్తూనే వున్నాను. కాని మీరే చెప్పనివ్వడం లేదు.''

''మాటల్ని కరెక్ట్‌గా రిపీట్ చేస్తారే. సరి..చెప్పండి.''

''చిత్రదుర్గలో ఒక హైస్కూల్‌లో టీచర్‌గా మూడు నెలల క్రిందట అప్పాయింట్ అయ్యాను. అక్కడ మీ ఇంట్లోనే బాడుగకు వున్నాను. మీ అమ్మకు నా మీద చాలా నమ్మకం.

పదివేల రూపాయిలు కావాలని మీరు ఉత్తరం వ్రాశారట. అందుకే-మీ అమ్మగారు పదివేల రూపాయలు నాకిచ్చి, మీ అడ్రస్ ఇచ్చి, మీకిచ్చిరమ్మని నన్ను పంపారు. ఒకసారి మిమ్మల్ని చూశాను. అందుకే సులభంగా గుర్తుపట్టాను.

ఆరువేలు క్యాష్ ఇచ్చాను. నాలుగువేలు ముందే మీకు ఖర్చుపెట్టాను. మొత్తం పదివేలు. అపరిచితుడ్నయినా, మీరు నాకిచ్చిన అందమయిన ఆతిథ్యానికి థాంక్స్'' అన్నాడు క్రిష్ణ.

అతడి మాటలేవీ రమణికి వినిపించడం లేదు. అప్పటికే ఆమె కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి.

★